ఆధునిక రూపంలో బాలల వెట్టిచాకిరి

డెబ్బైమూడేళ్ల స్వాతంత్ర్య పాలన అనంతరం కూడా దేశ ప్రజల జీవితాలు మెరుగు పడకపోగా రోజురోజుకి మరింతగా దిగజారుతున్నాయి. దేశం పెద్ద అంగలేసుకుంటూ అభివృద్ధి పథంలో దూసుకు వెళ్తున్నదని పాలకులు, పాలకవర్గాలు గంభీర ప్రకటనలు చేస్తూ వస్తున్నారు. కానీ ఈ ప్రకటనలు – ప్రజల్లో, ముఖ్యంగా గ్రామీణ ప్రజల్లో పెరుగుతున్న అశాంతి, దుర్భర దౌర్భాగ్య పరిస్థితులను మరుగు పరచలేకున్నాయి. వరుసగా అధికారంలోకి వస్తున్న ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక కార్పొరేట్ అనుకూల విధానాలు వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభం లోకి నెట్టివేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం, దుర్భర జీవన పరిస్థితుల నడుమ ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. ఘనంగా పేర్కొన బడుతున్న ఉపాధి హామీ పథకం (నరేగా) తోసహా ఏ ఒక్క ప్రభుత్వ పథకం కూడా దీనస్థితిలో ఉన్న గ్రామీణ కుటుంబాలకు ఎలాంటి ఉపశమనాన్ని కల్పించడం లేదు.

బతుకుతెరువు కొరకు సుదూర ప్రాంతాలకు వెళ్ళి, అక్కడ అనాధలుగా జీవితాలు గడపడంతో పాటు గ్రామీణ పేదలు తమ పిల్లలను వెట్టిచాకిరి చేయించేందుకు తాకట్టుపెట్టే దుస్థితికి దిగజారు తున్నారు. పిల్లలనుభవిస్తున్న కటిక దారిద్ర్యమే ఆ తల్లిదండ్రులను అలాంటి చర్యలకు పురిగొల్పుతోంది.

ఈ విధంగా పిల్లలను తాకట్టుపెట్టు కుంటున్న ఘటనలు రాజస్థాన్‌లోని బాన్సువారా, ప్రతాప్ ఘర్ జిల్లాలో వెలుగులోకి వచ్చాయి.

వెట్టిచాకిరీ చేయించుకోవటానికి పిల్లలను తాకట్టు పెట్టుకుంటున్న విధానాన్ని పూర్వ హోంమంత్రిగా పనిచేసిన బిజెపికి చెందిన కిశోరీలాల్ మీనా ఇటీవల రాజ్యసభలో లేవనెత్తాడు.

గడేరియాలకీ, సంచార జాతుల వారికీ పెద్ద పెద్ద గొర్రెల మందలు ఉంటాయి. గొర్రెలు కాయటానికి ఈ గడేరియాలు అలాగే ఇతర గొర్రెలకాపర్లు పిల్లలను తాకట్టు వెట్టికి కుదుర్చు కుంటారు. ఈ గొర్రెలకాపరులు రాజస్థాన్‌లోని నైరుతి ప్రాంతానికి చెందినవారు. వెట్టిపై తీసుకొచ్చిన ఈ పిల్లలను వీరు పశ్చిమ మధ్యప్రదేశ్, ఉత్తర గుజరాత్ ప్రాంతాలకు తీసుకువెళుతుంటారు. ఆ పశువులను కాసే పని ఆ పిల్లలకు అప్పగిస్తారు. వీరికి మూడు పూటలా తిండికూడా అంతంత మాత్రంగానే పెడతారు. కొన్ని సందర్భాల్లో ఈ గొర్రెల కాపరులు తిరిగి ఈ పిల్లలను రోడ్ల వెంబడిఉండే హోటళ్ళ యజమానులకు, హోటల్‌లో పనులు చేయటానికి అమ్మివేస్తుంటారు.

ఈ విధంగా అమ్ముడుపోయిన పిల్లల జీవితాలు దుర్భరంగా ఉంటాయి. కనీస దుస్తులు ఇవ్వరు. నెలల తరబడి ఒంటిపై ఉన్న జతను మార్చుకునే అవకాశం ఉండదు. కాళ్లకు చెప్పులు లేకుండా అనేక మైళ్ళ దూరం నడవడంవల్ల అరికాళ్లు బొబ్బలెక్కుతాయి. రాత్రిపూట నాలుగైదు గంటలు మాత్రమే వీరికి నిద్రపోవటానికి అవకాశమిస్తారు. తరచుగా గొర్రెల కాపరుల కుటుంబ సభ్యులు చిన్న చిన్న విషయాలకు కూడా పిల్లలను కొడుతుంటారు. ఈ పిల్లలు తిరిగి తమ తల్లిదండ్రులవద్దకు చేరుకుంటారనే గ్యారెంటీ లేదు.

ఈ గొర్రెలకాపరులు భిల్ అనే గిరిజన తెగకు చెందిన పిల్లలను వెట్టికి కుదుర్చు కోవడానికి ఇష్టపడతారు. ఎందుకంటే ఈ పిల్లలు చౌకగా లభిస్తారు. తక్కువగా తింటారు, కష్టపడి పనిచేస్తారు. చెప్పిన మాటల్ని వినే స్వభావం ఉన్నవాళ్ళయినందున వీరిని తమ చెప్పుచేతల్లో పెట్టుకోవడం సులభంగా వుంటుందని యజమానులు భావిస్తారు.

ఇక తల్లిదండ్రులవైపు నుండి చూస్తే వారికే చెయ్యటానికి పనులు ఉండవు. బిడ్డలను అమ్ముకోవడం తప్ప గత్యంతరం లేని స్థితిలోకి వారు నెట్టబడ్డారు. అందుకే వారు విధిలేక తమ మైనర్ కుమారులను వెట్టిచాకిరీ చేసేందుకు అమ్ముకుంటున్నారు.

మైనర్ బాలల ఈ ఆధునిక బానిసత్వం గురించి వెల్లడైనప్పుడు పాలనా యంత్రాంగం మాత్రం వారికి అప్పుడే మొదటిసారి తెలిసినట్లు, పిల్లలను అమ్ముకుంటున్నారని మొదటిసారిగా వింటున్నట్టు నటిస్తారు.

అన్నిచోట్ల ఇదే రూపంలో లేనప్పటికీ ఇతర రాష్ట్రాలలోని ప్రజలు సైతం వేర్వేరు రూపాల్లో తమ పిల్లలను వెట్టిలో వుంచే పరిస్థితులున్నాయి. ఒరిస్సా రాష్ట్రంలో పేదకుటుంబాలలోని సభ్యు లందరూ ఇటుకబట్టీలలో పనిచేయడానికి (వెట్టి చేయడానికి) కుదుర్చుకుంటున్నారు.

ఉత్తరాంధ్ర జిల్లాలలోని 14 – 16 సంవత్సరాల మధ్య వయస్కులైన బాలికలు సుదూరప్రాంతాల్లోని జనపనార మిల్లుల్లో, బట్టల మిల్లులలో పనిచేయాలని వెట్టిపై పంపబడు తున్నారు.

హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక గాజుల పరిశ్రమలో అనేక మంది పిల్లలు వెట్టి కార్మికులుగా ఉన్నారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో జరీ మరియు ఇతర పరిశ్రమల్లో అనేకమంది పిల్లలు వెట్టి చాకిరీ చేస్తున్నారు.

అలాగే పెద్ద సంఖ్యలో మైకా గనులు మరియు రాళ్ల క్వారీలలో పిల్లలు వెట్టిచాకిరికి కట్టివేయబతున్నారు.

కటిక దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న కుటుంబాలకోసం తమ ఇల్లు గడవడానికి తమ పిల్లలను తాకట్టు పెట్టడంతప్ప మరోమార్గం కానని దుస్థితిలో ఉన్నారనేది ఎవరు కాదనలేని వాస్తవం.

మనదేశంలో ఉన్న అర్ధభూస్వామ్య వ్యవస్థకు వారసత్వంగా వచ్చిన ఒక లక్షణం ఈ వెట్టిచాకిరీ విధానం. నయా ప్రపంచీకరణ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ ఆధునికత ఈ అర్ధభూస్వామ్య విధానంతో జత కలిసింది. భూస్వామ్య వ్యవస్థలో ఉండే ఇలాంటి హేయమైన విధానాలపై ఆధారపడి ప్రపంచంలో పెట్టుబడి అత్యధిక లాభాలను గడిస్తూ సంపదలను పోగేసుకుంటోంది.

మనుషులను అందులోనూ పసిపిల్లలను బానిసలుగా కట్టిపడేసే ఈ విధానానికి ముగింపు పలకాలంటే, దీర్ఘకాలికంగా నిస్తేజంగా ఉన్న ప్రజానీకం తమ జీవన స్థితిగతులను మెరుగు పరుచుకోవాలంటే శక్తివంతమైన ప్రజా ఉద్యమం యొక్క అవసరాన్ని ఈ నీచ, నికృష్ట పరిస్థితులు తెలియజేస్తున్నాయి.

000